క్లుప్తంగా

ఆక్రమణ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని ఆందోళన

చివ్వెంల : ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని మండల పరిధిలోని వట్టిఖమ్మంపహాడ్ గ్రామంలో ఆ గ్రామస్తులు గురువారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామ శివారులోని ఎకరం ప్రభుత్వ స్థలాన్ని అధికార పార్టీ నాయకుల అండతో కొంతమంది ఆక్రమించారని తెలిపారు. అక్రమంగా చెరువుమట్టి తవ్వి ఆ భూమిలో పోసి చదును చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ అధికారులు స్పందించి స్థలం అక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎల్కపల్లి వెంకన్న, గోగుల శ్రీనివాస్, వీరబోయిన సైదులు, వీరబోయిన మల్లేశం, గోగుల ఈదయ్య, చీమ వెంకన్న, వీరబోయిన మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న రామచంద్రయ్య

తిరుమలగిరి : తిరుమలగిరి మండలం తాటిపాముల గ్రామానికి చెందిన రాములు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. మృతుడి కుటుంబాన్ని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, తుంగతుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కడియం రామచంద్రయ్య గురువారం పరామర్శించారు. వారికి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎం.యాదగిరి, మండల శాఖ అధ్యక్షుడు బంగారురాజు, దీన్‌దయాళ్, హనుమంతు, శోభారాణి, దేవరాజ్, కుమార్, నాగరాజు, అంజయ్య పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

అర్వపల్లి : మండల పరిధిలోని కాసర్లపహాడ్ గ్రామపంచాయతీ ఆవాసం తూర్పుతండాలో కేతావత్ రవికి చెందిన ఆవు విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. గురువారం మేత కోసం ఆవును గ్రామశివారులోకి తీసుకెళ్లగా చెలుకలో మేస్తూ వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ విద్యుత్ వైర్లకు తగిలింది. దీంతో ఆవు అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఆవు రూ. 60వేల విలువ చేస్తుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కోరుతున్నారు.

నోట్ బుక్స్ పంపిణీపై హర్షం

సూర్యాపేటటౌన్ : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలకు నోట్ పుస్తకాలు పంపిణీ చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం పట్ల డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రేపాక లింగయ్య గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులకు టై, బెల్ట్, బ్యాడ్జీ, షూ, అల్పాహారం సౌకర్యాలు కూడా కల్పించాలని కోరారు. మన ఊరు మన బడి పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు.

చదరంగం ఆటతో మేధాశక్తి



చెస్ శిక్షణను ప్రారంభిస్తున్న కృపాకర్

సూర్యాపేటటౌన్ : చదరంగం ఆట విద్యార్థుల్లో శ్రద్ధ, ఆసక్తి, మేధాశక్తిని పెంచుతుందని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు, జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు గండూరి కృపాకర్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌లో విద్యార్థులకు ఏర్పాటు చేసిన ఉచిత చెస్ శిక్షణను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సతీష్‌కుమార్, రవ్వ రాంబాబు, ప్రభాకరాచారి, సాలయ్య, భిక్షం, సందీప్, కల్యాణ్, రాము పాల్గొన్నారు.

సేవాదల్ అధ్యక్షుడిగా కుంట పవన్‌రెడ్డి



సేవాదళ్ నూతన కమిటీ సభ్యులు

నూతనకల్ : మండల పరిధిలోని వెంకెపల్లిలో కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ గ్రామ శాఖను గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సేవాదళ్ మండల అధ్యక్షుడు గంగాధరి శ్రీధర్ తెలిపారు. గురువారం గ్రామంలో నిర్వహించిన సమావేశంలో అధ్యక్షుడిగా కుంట పవన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా పాల్వాయి లింగన్న, కార్యదర్శిగా మాతంగి గోవర్ధన్‌ను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. కాంగ్రెస్ సోషల్ మీడియా గ్రామ ఇన్‌చార్జ్‌గా యాతాకుల సందీప్‌ను నియమించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కుంట చంద్రారెడ్డి, మాజీ సర్పంచ్ కుంట బుచ్చిరెడ్డి, తొనుకునూరి సైదులు, దేశగాని కరుణాకర్ పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

మునగాల : ముకుందాపురం శివారులోని వృద్ధాశ్రమంలో ఆకుపాముల గ్రామానికి చెందిన గూటి నరేష్- నవ్య దంపతుల కుమార్తె కారుణ్యశ్రీ పుట్టినరోజు సందర్భంగా గురువారం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు బక్క నాగేశ్వరరావు, వెంకటనారాయణగౌడ్, చిరంజీవి, అబ్దుల్, సతీష్, సాయి, ఉపేందర్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో వసతుల కొరత

- కనీసం తాగునీరు, నీడ వసతి కల్పించని నిర్వాహకులు
- టార్పాలిన్లు అందుబాటులో లేక వర్షాలకు తడుస్తున్న ధాన్యం
- ఇప్పటికైనా మౌలిక సౌకర్యాలు కల్పించాలని రైతుల వేడుకోలు



అనంతారంలోని పీఏసీఎస్ కొనుగోలు కేంద్రం

పెన్‌పహాడ్ : ఆరుగాలం కష్టించి పండించిన పంటను అమ్ముకోవడానికి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆర్భాటంగా ప్రారంభించిన ప్రజాప్రతినిధులు వాటిల్లో మౌలిక వసతులు కల్పించడం మరిచిపోయారు. దీంతో అనేక మంది రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. అయినప్పటికీ సంబంధిత శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. పెన్‌పహాడ్ మండలంలోని పెన్‌పహాడ్, ధర్మాపురం, చీదెళ్ల, గాజులమల్కాపురం, అనంతారం, నారాయణగూడెం, అన్నారం బ్రిడ్జి, అన్నారం గ్రామాల్లో పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో, సింగారెడ్డిపాలెం, అనాజిపురం, భక్తాళాపురం, దూపహాడ్, మాచారం గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. కానీ ఆయా కేంద్రాల్లో మౌలిక వసతులు లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రైతులు కూర్చునేందుకు కుర్చీలు, నీడ ఏర్పాటు చేయాలని అధికారులు సూచిస్తున్నా.. నిర్వాహకులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ధాన్యం పోసుకోవడానికి, కప్పడానికి పట్టాలు ఇవ్వడం లేదని రైతులు వాపోతున్నారు. ధాన్యం కాంటాలు ఆలస్యం అవుతుండడం, రోజుల తరబడి కేంద్రాల్లోనే పడిగాపులు కాయాల్సి వస్తుండటంతో ఇబ్బందులు పడుతున్నారు.

వాతావరణ మార్పులతో హడల్..

రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించి తేమశాతం తగ్గించేందుకు ఆరబెడుతున్నారు. కానీ ఇటీవల వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటుండటంతో రైతులు హడలిపోతున్నారు. భారీ వర్షం పడితే ఇక రైతుల పరిస్థితి అంతే సంగతులు. ధాన్యం కప్పేందుకు పట్టాల కొరత వేధిస్తోంది. కొందరికి సొంతంగా పట్టాలు ఉండగా మరికొందరు అద్దెకు తెచ్చి వాడుతున్నారు. కనీసం ఇప్పటికైనా అధికారులు స్పందించి టార్పాలిన్ పట్టాలు అందుబాటులో ఉంచడంతో పాటు ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని రైతులు కోరుతున్నారు. అలాగే కేంద్రాల వద్ద కనీస సౌకర్యాలు కల్పించాలని వేడుకుంటున్నారు.

పట్టాలు అందుబాటులో ఉంచాలి

“ ఇటీవల పడుతున్న అకాల వర్షాల వల్ల కొనుగోలు కేంద్రాల వద్ద పట్టాలు అందుబాటులో ఉంచాలి. పట్టాలు లేకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నాం. అర్ధరాత్రి వేళలో వర్షం పడితే మేము ఎటు వెళ్లాలో తెలియని పరిస్థితి నెలకొంది.

\- బొలిశెట్టి వెంకటరమణ, రైతు, అన్నారం

కనీస వసతులు కల్పించాలి

“ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో కనీస వసతులు లేక ఇబ్బందులు పడుతున్నాం. కేంద్రాల వద్ద తాగునీరు, నీడ కూడా ఏర్పాటు చేయలేని దుస్థితి ఏర్పడింది. రైతులు కూర్చునేందుకు కుర్చీలు ఎక్కడా కనిపించడం లేదు. అధికారులు స్పందించి మౌలిక వసతులపై దృష్టి సారించాలి.

\- వెంకన్న, రైతు, భక్తాళాపురం

సీఎం, మంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న గీత కార్మికులు

పెన్‌పహాడ్ : గీత కార్మికులకు బీమా కల్పించడంతో పాటు నీరా ఉత్పత్తులను ప్రోత్సహించడం పట్ల సీఎం కేసీఆర్, మంత్రి జగదీశ్‌రెడ్డి చిత్రపటాలకు గురువారం మండల పరిధిలోని లింగాల గ్రామంలో గౌడకులస్తులు, బీఆర్‌ఎస్ నాయకులు పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మామిడి సైదులు, దుర్గయ్య, స్వర్ణ, నల్లపు శ్రీను, రణపంగ సైదులు, సతీష్, శేఖర్, మామిడి రవి పాల్గొన్నారు.

సేవా సమితి ఆధ్వర్యంలో బియ్యం పంపిణీ



బియ్యం పంపిణీ చేస్తున్న శంకర్‌రెడ్డి

ఆత్మకూర్ (ఎస్) : మండల పరిధిలోని రామన్నగూడెంలో భూరెడ్డి రాంరెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం నిరుపేదలకు బియ్యం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సేవా సమితి నిర్వాహకుడు భూరెడ్డి శంకర్‌రెడ్డి మాట్లాడారు. భూరెడ్డి రాంరెడ్డి పేద ప్రజల అభ్యున్నతికి పాటుపడ్డాడని, ఆయన ఆశయ సాధనకోసం పేదలకు ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో 25 మందికి 25 కిలోల చొప్పున బియ్యం అందించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు బత్తుల సురేందర్, బత్తుల వెంకన్న, పాల్వాయి వెంకటేష్, బత్తుల వెంకట్ రాములు, బత్తుల నగేష్, బత్తుల శ్రీను, బత్తుల శ్రీపాల్, మిరియాల చిన్ని, బత్తుల మహేష్ పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

నాగారం : నాగారం మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ కూరం మణివెంకన్న, ఎంపీడీఓ జి.శోభారాణి తెలిపారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ హాజరవుతున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని కోరారు.

వైభవంగా సుదర్శన నారసింహ హోమం



హోమం నిర్వహిస్తున్న పూజారులు

భానుపురి : పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండవ రోజు గురువారం యాగశాలలో సుదర్శన నారసింహ హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు నల్లన్ చక్రవర్తుల వేణుగోపాలాచార్యులు మాట్లాడారు. సకల గ్రహదోష, శత్రు నివారణార్థం ఈ హోమాన్ని నిర్వహించామని తెలిపారు. ఈ వేడుకలో యజ్ఞాచార్యులు హరిచరణ్ ఆచార్యులు, అర్చకులు సంకర్షణాచార్యులు, శ్రీహరి, ఫణి కుమార్, భరత్, తదితరులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవ కార్యక్రమాల్లో భాగంగా సాయంత్రం ఎదుర్కోలు మహోత్సవం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్న ప్రసాదం అందజేశారు.

నేడు శ్రీ వేంకటేశ్వర స్వామి వారి కల్యాణం..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం ఏడు గంటలకు ఆలయ ప్రాంగణంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి కల్యాణం నిర్వహించనున్నట్లు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలచార్యులు, కార్యనిర్వహణాధికారి యేరువ శ్రీనివాసరెడ్డి గురువారం తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన



రామచంద్రపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ అమీన్‌సింగ్



మిర్యాలలో రైతులతో మాట్లాడుతున్న అధికారి

పెన్‌పహాడ్ : రైతులు ఎవరు కూడా అధైర్య పడొద్దని, ధాన్యం చివరి బస్తా వరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దొంగరి యుగేందర్ అన్నారు. గురువారం దోసపహాడ్ గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి ధాన్యం బస్తాలు మోశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ మేకల శ్రీను, జగన్, రాము, గద్దల వెంకన్న, సత్యనారాయణ, రవికుమార్, వెంకటేశ్వర్లు, రాజు, రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలు జరగకుండా చూడాలి

మద్దిరాల : ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి అక్రమాలు జరగకుండా కాంటాలు నిర్వహించాలని తహసీల్దార్ అమీన్‌సింగ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని రామచంద్రపురం, రెడ్డిగూడెం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీసీ నాగార్జున్‌రెడ్డి, నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

లారీల కొరత లేకుండా చూడాలి

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కాంటాలైన ధాన్యం ఎగుమతికి లారీల కొరత లేకుండా చూడాలని సీపీఎం మండల కార్యదర్శి వజ్జె శ్రీనివాస్‌యాదవ్ కోరారు. గురువారం విలేకరులతో మాట్లాడారు. మండలంలోని వివిధ కేంద్రాల్లో లారీలు రాక కాంటాలైన వేలాది బస్తాల ధాన్యం అక్కడే ఉందని చెప్పారు. కాంటాలైన ధాన్యం లారీలకు వేసేదాక రైతులదే బాధ్యతని నిర్వాహకులు చెబుతుండటంతో రైతులు రేయింబవళ్లు బస్తాల వద్దే ఉండాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

తుకాలు వెంటనే నిర్వహించాలి

నూతనకల్ : కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తుకాలు వెంటనే నిర్వహించాలని మండల స్పెషల్ అధికారి నాగేందర్ నిర్వాహకులను కోరారు. గురువారం మండల పరిధిలోని మిర్యాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడారు. అకాల వర్షాల వల్ల ధాన్యం రాసులు తడవకుండా రైతులు జాగ్రత్తలు పాటించాలని ఆయన కోరారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ధాన్యం రాసులకు త్వరితగతిన కాంటాలు నిర్వహించాలని, కేటాయించిన మిల్లులకు బస్తాలు ఎగుమతి చేయాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం కర్ణాకర్, నిర్వాహకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ఆత్మకూర్ (ఎస్) : మండల కేంద్రంలోని శ్రీభూగోదా సమేత చెన్నకేశవస్వామి దేవాలయం, కందగట్లలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయాల వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వస్తి వాచకం, విశ్వక్సేన పూజ, పుణ్యాహ వాచనం, రక్షాబంధనం, అగ్నిప్రతిష్ఠ నిర్వహించారు. 5న గరుడ హోమం, ధ్వజారోహణం, గరుడముద్ద, సాయంత్రం 6.30 గంటలకు తిరుకల్యాణ మహోత్సవం కార్యక్రమాలు జరగనున్నాయి. 6న మహాపూర్ణాహుతి, చక్రతీర్థంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

బొల్లంపల్లిలో ప్రత్యేక అధికారి సమీక్ష



మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి

అర్వపల్లి : బొల్లంపల్లి గ్రామాన్ని గురువారం డీఏఓ, మండల ప్రత్యేక అధికారి రామారావునాయక్ సందర్శించారు. వననర్సరీని, మురుగు కాల్వలను, వీధులను పరిశీలించారు. వివిధ సమస్యలపై గ్రామపంచాయతీ కార్యాలయంలో సమీక్షించారు. కార్యదర్శులు సమ్మెలో ఉన్నందున ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా చూడాలని గ్రామపంచాయతీవారిని కోరారు. కార్యక్రమంలో ఎంఏఓ ఆర్. శౌధర్‌రెడ్డి, ఎంపీడీఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ నర్సింహరాజు, బిల్ కలెక్టర్ రవి పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే చేపట్టి నివేదిక అందిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకారెడ్డి

హుజూర్‌నగర్ : ఎలక్షన్ కమిషన్ అందించే సమాచారాన్ని రాజకీయ పార్టీలకు ఎప్పటికప్పుడు తెలియజేస్తామని ఆర్డీఓ కె.వెంకారెడ్డి అన్నారు. గురువారం హుజూర్‌నగర్ పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం ఒకే ఇంటిలో ఆరుగురి కంటే ఎక్కువ మంది ఉన్న ఓటర్ జాబితాను ఎలక్షన్ కమిషన్ ఇచ్చిందని తెలిపారు. ఆ జాబితా ప్రకారం బీఎల్‌ఓల ద్వారా ఇంటింటి సర్వే నిర్వహించి సదరు ఓటర్లు ఆ నివాసంలో ఉన్నారా, లేరా అని సరిచూసుకొని నివేదిక అందజేస్తామన్నారు. ఓటర్ల ఇంటి నెంబర్ తప్పుగా నమోదైతే ఫారం ఎనిమిది ద్వారా నమోదు చేస్తామని ఆయన తెలిపారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు బూత్ లెవల్ కమిటీలను నియమించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో మండల తహసీల్దార్ వజ్రాల జయశ్రీ, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ కమాలాకర్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఎల్లవుల రాములు, వేముల శేఖర్‌రెడ్డి, అరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్, జక్కుల శంభయ్య, శ్రవణ్‌కుమార్, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శుల ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలి



అర్వపల్లిలో బతుకమ్మలతో నిరసన వ్యక్తం చేస్తున్న కార్యదర్శులు



చివ్వెంల : ముగ్గులు వేసి నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్యదర్శులు

అర్వపల్లి : జూనియర్ పంచాయతీ కార్యదర్శుల ఉద్యోగాలను వెంటనే క్రమబద్ధీకరించాలని తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు దేవులపల్లి నవీన్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జి. నాగరాజు డిమాండ్ చేశారు. నిరవధిక సమ్మెలో భాగంగా నియోజకవర్గంలోని 6 మండలాల పంచాయతీ కార్యదర్శులు గురువారం అర్వపల్లి వైజంక్షన్‌లో మానవహారం నిర్వహించి బతుకమ్మ అట ఆడారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు వెంటనే తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆరు మండలాల అధ్యక్షులు కె. అరుణ్, గంగరాజు, జి. మహేష్, జగదీష్, వి. రాజు, మహిళా కార్యదర్శులు సరళ, జ్యోతి, భవాని, కావ్య, మహాలక్ష్మి, మంగమ్మ, ఉమ, తేజశ్రీ, పుష్ప, కార్యదర్శులు రమేష్, తరుణ్, శోభన్‌బాబు, నెహ్రూనాయక్, శ్రీనివాసరాజు, లింగస్వామి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల వినూత్న నిరసన

చివ్వెంల : జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో చేపడుతున్న సమ్మె గురువారం 7వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా జేపీఎస్‌లు ముగ్గులు వేసి నిరసన తెలిపారు. గ్రామాల్లోని మల్టీపర్పస్ వర్కర్లు వారికి మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కొప్పుల బక్కయ్య, బండారు పవన్‌కుమార్, గణపారపు మధు, బొల్లం అశోక్, రజిని, పర్వీన్, రమణ, గౌతమి, కారుణ్య, స్రవంతి, కవిత, సైదులు, అరవిందు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బొడ్రాయి, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న భక్తులు

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని చీదెళ్ల గ్రామంలో బొడ్రాయి, శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన కార్యక్రమాలను గురువారం అంగరంగవైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. పురోహితులు భాస్కరశర్మ వేద మంత్రోచ్ఛరణల నడుమ బొడ్రాయి, ధ్వజస్తంభ ప్రతిష్ఠ పూర్తి చేశారు. గ్రామస్తులు బోనాలతో ర్యాలీగా వెళ్లి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ఎంపీపీ నెమ్మాది భిక్షం ప్రారంభించారు. ఈ వేడుకల్లో సర్పంచ్ పరెడ్డి సీతారాంరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెన్న సీతారాంరెడ్డి, ఎంపీటీసీ జూలకంటి వెంకట్‌రెడ్డి, రైతు విభాగం మండల అధ్యక్షుడు గుర్రం అమృతారెడ్డి, బిజిగ గోపి, ఆవుల అంజయ్య, కొండమీది వెంకన్న, చింత రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

భక్తిభావం పెంపొందించుకోవాలి

పెన్‌పహాడ్ : సమాజంలో ప్రతి ఒక్కరూ భక్తిభావం పెంపొందించుకోవాలని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్య యాదవ్‌లు అన్నారు. గురువారం మండల పరిధిలోని చీదెళ్ల గ్రామంలో బొడ్రాయి, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి వారు వేర్వేరుగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పరెడ్డి సీతారాంరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెన్న సీతారాంరెడ్డి, ఎంపీటీసీ జూలకంటి వెంకట్‌రెడ్డి, రైతు విభాగం మండల అధ్యక్షుడు గుర్రం అమృతారెడ్డి, ఆవుల అంజయ్య, బిజిగ గోపి, వెన్న గోపిరెడ్డి, సొంటి శ్రీను, చింత రాంబాబు, కొండమీది మురళి, గోపి, ఎడ్ల వెంకట్‌రెడ్డి, రణబోతు శ్రీనివాస్‌రెడ్డి, బెల్లంకొండ శ్రీరాములు, షఫిఉల్లా తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న రమేష్‌రెడ్డి, తదితరులు



బొడ్రాయికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

ప్రియాంకగాంధీ సభను జయప్రదం చేయాలి

అర్వపల్లి : హైదరాబాద్‌లో ఈ నెల 8న జరిగే విద్యార్థి నిరుద్యోగ నిరసన జంగ్‌సైరన్ సభకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ హాజరవుతున్నందున నిరుద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని డీసీసీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచారి కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నిరుద్యోగ యువత సమస్యలపై ఈ సభలో చర్చించడం జరుగుతుందని చెప్పారు. ఈ సభలో ప్రియాంకగాంధీ యూత్ డిక్లరేషన్‌ను ప్రకటిస్తారని తెలిపారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మోరపాక సత్యం, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శిగ నసీర్‌గౌడ్ పాల్గొన్నారు.

‘కంటి వెలుగు’ వైద్యశిబిరం ప్రారంభం



కంటి వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ

తిరుమలగిరి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అంధత్వ నివారణ చర్యల్లో భాగంగా పద్దెనిమిది సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఉచితంగా కంటి వైద్య పరీక్షలు చేయిస్తోందని ఎంపీపీ నెమురుగొమ్ముల స్నేహలత అన్నారు. గురువారం మండల పరిధిలోని సిద్ధి సముద్రం గ్రామంలో కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ కంటి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ దూపటి అంజలి, ఎంపీటీసీ సభ్యుడు జమ్మిలాల్, సీహెచ్‌ఓ బిచ్చునాయక్, క్యాంపు డాక్టర్ సమతారాణి, లలిత, సరిత, రజిత, ఎల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో గృహలక్ష్మి పథకం అమలు

నడిగూడెం : రాష్ట్రంలో గృహలక్ష్మి పథకాన్ని ప్రభుత్వం త్వరలో అమలు చేయనున్నట్లు కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ వెల్లడించారు. గురువారం ఆయన మండల పరిధిలోని వల్లాపురం వచ్చిన సందర్భంగా ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కోదాడ నియోజకవర్గంలో గృహలక్ష్మి పథకం ద్వారా మూడు వేల మందికి ఇళ్ల నిర్మాణానికి ఒక్కొక్కరికి ప్రభుత్వం మూడు లక్షల రూపాయలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. నియోజవర్గంలోని పలు మండలాలలో తొలి విడతగా 100 శాతం సీసీ రహదారుల పనులు పూర్తయినట్లు తెలిపారు. రెండో విడతగా డ్రెయినేజీ కాల్వల నిర్మాణంపై దృష్టి సారించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం నియోజకవర్గ వ్యాప్తంగా రూ.50 కోట్ల వ్యయంతో బీటీ రోడ్ల పనులు జరుగుతున్నట్లు తెలిపారు. ఆయన వెంట వల్లాపురం గ్రామ సర్పంచ్ వట్టికూటి చంద్రయ్య, సింగిల్ విండో మాజీ చైర్మన్ దేవబత్తిని సురేష్ ప్రసాద్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు దేవబత్తిని వెంకటనర్సయ్య, నడిగూడెం సహకార సంఘం చైర్మన్ పుట్టా రమేష్, ఇమ్మడి వెంకన్న, నడిగూడెం, మోతె, అనంతగిరి మండలాల బీఆర్‌ఎస్ నాయకులు, తదితరులు ఉన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

నాగారం : శాంతినగర్ గ్రామానికి చెందిన పొదిల ఇస్తారి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ సందర్భంగా గురువారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, తుంగతుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కడియం రామచంద్రయ్య మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, క్వింటా బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో అనంతుల సోమేష్, మధు, పవన్‌కళ్యాణ్, నరేష్ పాల్గొన్నారు.

మేడే వారోత్సవాలు



తిమ్మాపురంలో సీపీఎం జెండాను ఆవిష్కరిస్తున్న బచ్చలకూరి రాంచరణ్


చివ్వెంల : మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామంలో గురువారం మేడే వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జెండాను పార్టీ మండల కార్యదర్శి బచ్చలకూరి రాంచరణ్ ఆవిష్కరించి మాట్లాడారు. ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జటంగి వెంకన్న యాదవ్, నారెడ్డి వెంకట్‌రెడ్డి, సుదగాని లింగయ్య, వీరయ్య, వెంకన్న, మల్సూర్ తదితరులు పాల్గొన్నారు.

నెలకు రూ.2వేలు పింఛన్ ఇస్తూ వృద్ధుడికి చేయూత

నడిగూడెం : మండల పరిధిలోని కరివిరాల గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన 65 సంవత్సరాల షేక్ సిద్ధయ్యకు ప్రభుత్వం నుంచి పెన్షన్ మంజూరు కాలేదు. దీంతో అతను ఆర్థిక ఇబ్బందులు పడుతుండడంతో అదే గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త గార్లపాటి మహేష్‌రెడ్డి గత 10 నెలలుగా నెలకు రూ.2 వేలను స్వచ్ఛందంగా అందజేస్తున్నాడు. గురువారం ఈ నెల రెండు వేల రూపాయల ఆర్థికసాయం అందజేశారు.

ప్రజా ఉద్యమాలు చేపట్టాలి

ఆత్మకూర్(ఎస్) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై ప్రజా ఉద్యమాలను చేపట్టాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంట నాగయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని రామన్నగూడెం గ్రామంలో మేడే సందర్భంగా జెండా విష్కరించారు. అరుణోదయ రామారావు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు.ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ గ్రామ కార్యదర్శి రమేష్, సంజీవరెడ్డి, సత్యం, వెంకట్ రెడ్డి, లచ్చిరెడ్డి, దామెర శీను, వీరారెడ్డి, ఐతగోని సైదులు, సోమారపు పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.



రామారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న న్యూడెమోక్రసీ నాయకులు